"వారిజాక్షులందు వైవాహికములందు...
బొంకవచ్చు నఘమువొంద దధిప!"

# మి థ్యా మ తి

అంగర వెంకటకృష్ణారావు

తెల్లపిల్లని మీరు చూసే వుంటారు. కాని 'ఫలానా' అని గుర్తించి వుండకపోవచ్చు. ఆమెకీ నాకూ స్నేహం.

తల్చుకోగానే సత్యవతికి కృష్ణద్వైపాయనుడు వలె ప్రత్యక్షం ఔతుంది. కానీ కోరకుండా నా వాంఛ యీడేరుస్తుంది.

ఒచ్చి నావొళ్లో అమాంతంగా కూచుని, నిగనిగ మెరిసే తన నేత్రద్వయి నావెంపుతిప్పి, కొంటెగా నవ్వుతూ నాబుగ్గలు సాగదీస్తుంది. 'కురు యదునందన చందన శిశిరతరేణ కరేణపయోధరే' అని దబాయించి సర్వసేవలూ చేయించుకుంటుంది. ఆతెల్లపిల్ల సౌందర్యం వర్ణనాతీతం.

ఈభావనాతీతరూపవతి నాకుచేసే ఉపకారం యింతాంతకాదు. ఈమె లేకపోతే నాజీవిత సముద్రంలో ఉప్పెనలు పుట్టివుండును. కార్చిచ్చులు చెలరేగి నా ఆనందవల్లరి భస్మీపటలం ఆయివుండును.

ఒక్కొక్కప్పుడు సల్వారు పొడుగుచేతుల చొక్కా ధరించి, పైన దుపట్టాతో, చెమ్కీ శాండల్సుతో, పక్కా 'లాహోరీ' వలె వచ్చేది. మరొకప్పుడు తల నున్నగా దువ్వుకుని, తేలుకొండి వలె సిగచుట్టుకొని, ఐదుగజాల శాంతిపురీ సిల్కు చీర ధరించి అచ్చంగా మా 'అరుణ' వలె హాజరయ్యేది. లేకపోతే వుల్లిపొరవంటి గులాబీరంగు బ్లౌజులోంచి దుగ్ధవర్ణం చిమ్ముతూ, దవ్వలవంటి పిక్కలమీద సిమ్మెంట్రంగు మేజోడుతో, 'ఫాన్సీ బ్యాగ్' తో, బాతుయీకకంటె తేలికగా నడుస్తూ 'రాక్సీ'లా వెనకనించే నోరునొక్కి నోట్లో పిప్పరమెంటు కుక్కేది.

అదిగో! అప్పుడే మీలో చాలామంది పిస్తోలు లాంటి చూపుడువ్రేలు నావెంపు గురిపెడుతున్నారు—అబద్ధాలరాయడనీ(ఏమంటే వీడికిన్ని పరిచయాలా-వీడేం నారీనవమన్మథుడా!) లేకుంటే ఛీ! ఛీ! వీడు పతితుడు. వీడిని మనింటికి రానీయకూడదు అని. మహాప్రభో! మా 'చిన్నారి' కూడా మీలాగే అనుమానపిశాచంతో బాధపడుతూంది. నేను మాత్రం ప్రవరాఖ్యుడిని!!

'చిన్నారి', నేనూ అవేళ రాత్రి ఎనిమిదిగంటలకు తీవ్రంగా దెబ్బలాడుకున్నాం - పక్కలు నువ్వేయ్ అంటే నువ్వేయ్ అని. ఎంతబ్రతిమాలినా విందికాదు. చివరికి ఎవరిపక్క వాళ్లే అంది. నా వొళ్లు మండింది. 'ఓసీ-స్త్రీ! భార్యా!! అస్వతంత్రజీవీ! ఇంత పొగరా!' అనుకున్నా నాలోనే. ఐతే? గబగబ తనపక్క వేసేసుకుంది. అది గభేల్న తీసి పారేశా. ఉరిమింది నావేపు. కాని నేను భర్తనయిపోయాను. అదేప్రకారం ఒక పాతికసార్లు పక్క వేసుకుంది-పాతికసార్లు నేను పాడుచేశా. సరిగా పదిగంటల రెండు నిమిషాలకు ప్రతినపట్టింది: 'ఈ జన్మలో నీతో మాట్లాడ'నని. వెళ్ళి వరండాలో నేలమీద పడుకుంది, తలక్రింద చెయ్యిపెట్టుకుని. ఒంటిగంట-రెండు! కాలం కాకిలా ఎగిరిపోతూంది. కిటికీలోంచి చుక్కలు మా తగాయిదా చూసి కిలకిల నవ్వుకున్నాయి. రెండుపక్కలూ నేనేవేశా-ఓటమి నాదే! కాని 'చిన్నారి' బిఱ్ఱబిగిసింది, రమ్మంటే రాదు. బతిమాలిన కొద్దీ పేనుకుపోతూంది. నులకతాడులా మెటికలు విరిగిపోతున్నాయి. ఊర్పులు కాలసర్పిణి కడుపులోంచి వలె దీర్ఘంగా, బరువుగా వస్తున్నాయి. మా బహుదీన పరిస్థితి రవ్వంతైనా లెక్కచెయ్యకుండా గడియారం మూడుసార్లు తల నేలకేసుకు కొట్టుకుంది. ఇంకేది గత్యంతరం! 'వికిరతి ముహుః శ్వాసా... ముహురీక్షతే'...ఇది నాస్థితి.

హటాత్తుగా వుపాయం తట్టింది. తెల్లపిల్లని ఆహ్వానించా— "ఆ తెల్లపిల్ల ఎంతమంచిది! ఒకసారి యిలాంటి వెన్నెలరాత్రే తొమ్మిదింటికి వచ్చి 'పద షికారు' అంది. చిన్నచలి- అయితేనేం! రెండు ఫ్లాస్కులలో వేడి 'టీ' పోసి బయల్దేరాం. వెన్నెల పాలవెల్లి! గంగానదీ జలం పాదరసంవలె

మెరిసిపోతూంది. నదికి అవతలిగట్టున 'చంద్ర నాగోర్'- రాతిమెట్లు- పెవిలియన్లలో చక్కని బెంచీలు- పాలగచ్చు చపటా. వెనక వెడలుపై వెన్నెలని ప్రతిబింబిస్తూ నిగనిగల తారురోడ్డు- దాని ప్రక్కని నదికెదురువాసగా మహోన్నత భవనాల నడుమ 'కాంచనజంగా' శృంగంలాంటి చర్చి- దానిముందు శిల్పస్తంభంమీద 'డూప్లే' కంచువిగ్రహం... ఏమిదృశ్యం! ఏకాంతంగా, నిశ్శబ్దంగా వెళ్ళిపోతూన్న మా పడవలోంచి చూసి, ఆ తెల్లపిల్ల శరీరం పులకరించి ధగధగ మెరిసే తన కళ్లు నావెంపు త్రిప్పి 'ఆహాహ్ ? ఏమి వెన్నెలరాత్రి బుచ్చీ! (నన్నలాగే పిల్చేది). ఇది దేవతలు విహరించే వేళ! గురుదేవుడు రవిఠాకూర్ వ్రాసిన "తాజ్ మహల్" వ్యాసంలో 'జ్యోత్స్నరాతిరేయ్, నిభృతమొంది రేయ్, ప్రేయొషిరే జేనామెడాకితేధీరె' అన్న అనన్యసామాన్య వర్ణన జ్ఞాపకం వస్తూంది' అంటూ నాదగ్గరగా వస్తూ......"

వెక్కి వెక్కి ఏడుస్తూ, ధారాపాతంగా కన్నీళ్లు కారుస్తూ, నాగుండెలలోకి ఒత్తిదూర్చి...ఎందుకు వెళ్ళాలి అలాంటి వాళ్ళదగ్గరకి!....ఇంక వెళ్ళకండి ....ఏం! అంది 'చిన్నారి'.

"అబ్బెబ్బె! ఏడవకూడదు...."కలకంఠి కంట కన్నీరొలికిన" అని సముదాయిస్తూ...."ఆ తెల్లపిల్ల మంచిదికాదు సుమీ! చిన్నారిముందు నువ్వు దిగదుడుపుకైనా పనికిరావు అంటే ఆ తెల్ల బెంగాలీ పిల్లకి నామీద కోపంవచ్చి మాటలు మానేసింది" అన్నా.

నాలోకి గుచ్చుకుపోతూన్న 'చిన్నారి' ని చూసి ఆ తెల్లపిల్ల వెన్నెలని చీల్చుకుని, దూదిల్లాంటి మేఘశకల సోపానాలెక్కి చందమామ చాటుకుని పకపక విరగబడి నవ్వింది.

# వయోజన వోటింగు

తాడిమళ్ల జగన్నాథరావు

ప్రాతినిధ్య ప్రభుత్వాలు ఈ రోజుల్లో అభిమానింపబడుతున్నాయి. అంటే ప్రజలు తమ వోటు ద్వారా తమప్రతినిధులను ఎన్నుకుంటారు.వీరే శాసన సభ్యులు. ఈ శాసన సభ్యులకు ప్రజల కష్టసుఖాలను ప్రతిబింబింప చేయవలసిన నైతిక బాధ్యత ఉంది. ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా రాజకీయాధిక్యతను నిల్పుకోవాలి. ఇదే ప్రాతినిధ్య ప్రభుత్వాలలోని కీలకం. ప్రపంచంలోని రాజ్యాలన్నిటిలోను తలోవిధంగా ఈ ఎలక్టొరేటు ఏర్పాటు చేయబడింది. కొన్ని రాజ్యాంగాల్లో వయోజనులందరు ఓటర్లుగా చేరకలిగిన యోగ్యత కలిగి ఉంటారు. బ్రిటన్, అమెరికా, కెనడా మున్నగు రాజ్యాంగాల్లో వయోజన వోటింగు పద్ధతి ఉంది. మరికొన్ని ఇతర రాజ్యాంగాలలో ఆస్తి, జాతి, విద్య మున్నగు ప్రత్యేక యోగ్యతలు కలవారే ఓటర్లుగా చేరగల్గుతారు. ఉదాహరణగా దక్షిణాఫ్రికాలో జాతినిబట్టి ఓటరుగా చేరగలిగే యోగ్యత నిర్ణయింపబడుతుంది. అందుచేతనే అక్కడి ఇండియన్లు నానాబాధలు పడుతున్నారు. ఇల్లాంటి రాజ్యాంగాలలో ఓటింగు హక్కు సంకుచితం చేయబడిందన్నమాట. పందొమ్మిదవ శతాబ్దంలోని పెక్కుమంది న్యాయశాస్త్ర వేత్తలు వయోజన వోటింగు ఉండాలంటున్నారు. "వోటింగు హక్కు పరమ పవిత్రమైనది. ఈ హక్కు అందరికీఉండాలి. ఏదో వంకని యీహక్కు తీసివెయ్యరాదు. న్యాయశాస్త్రం ప్రజల అభీష్టాన్ని వ్యక్తపర్చాలి. ప్రజలు స్వయంగా గాని లేక తమ ప్రతినిధుల ద్వారాగాని తమ అభీష్టాన్ని తెల్పుకొనే హక్కు కల్గివుండాలి. రాజ్యాంగ సమానత్వం ఉండాలి. సంకుచితమైన ఓటింగుద్వారా ఈ సమానత్వానికి భంగం కల్గించకూడదు. ఓటింగు హక్కు లేకపోతే శాసన సభలలో వారి హక్కులకు రక్షణ కల్పించనట్టే" అని వీరి వాదన.

"భార్యల హక్కులను కాపాడ్డానికి భర్తలు, అప్పచెల్లెళ్ళహక్కులనుకాపాడ్డానికి అన్నదమ్ములు, కూతుళ్ల హక్కులు కాపాడ్డానికి తండ్రులు ఉన్నంత కాలం భార్యల్ని, అప్పచెల్లెళ్ళని, కూతుళ్లని ఎందుకు వోటర్లుగా చేర్చాలి?-" అని వయోజన వోటిం